# బీఆర్ఎస్ వెంటే ఉద్ధండులు

## జిల్లాలో మారిన రాజకీయ ముఖచిత్రం







- గులాబీ పార్టీలోనే మాజీ ఎమ్మెల్యేలు, గతంలో పోటీ చేసిన నేతలు
- అంతా ఏకతాటిపైకి రావడంతో తిరుగులేని శక్తిగా గులాబీ దళం
- ఆలేరులో బూడిద భిక్షమయ్యగౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి
- భువనగిరిలో ఉమామాధవరెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వరరెడ్డి
- ఏకాకిగా మారిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు
- 'హస్తం'లో సొంత పార్టీలోనే నేతల సహాయ నిరాకరణ
- ఇక బీఆర్ఎస్ గెలుపు నల్లేరు మీద నడకే..
- 50వేల మెజారిటీ లక్ష్యంగా గులాబీ పార్టీ పావులు

జిల్లాలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. బీఆర్ఎస్ హవాతో ఉద్యమకారులు, తెలంగాణవాదులు కారెక్కుతున్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ వరకు గులాబీ కండువా కప్పుకొంటున్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ర్టాన్ని రాబంధుల పాలు అవ్వకుండా కాపాడుకునేందుకు ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల కాంగ్రెస్ నుంచి జిట్టా బాలకృష్ణారెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పుకొన్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, కంటెస్టెడ్ ఎమ్మెల్యేగా పనిచేసినోళ్లంతా ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. దీంతో ఆ పార్టీ సంస్థాగతంగా మరింత బలంగా తయారైంది.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు, పోటీ చేసిన నేతలంతా ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉండడంతో గులాబీ దళం తిరుగులేని శక్తిగా మారింది. ఆలేరులో భిక్షమయ్యగౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి.. భువనగిరిలో ఉమామాధవరెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితర నేతలంతా కారు పార్టీలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా మంచి క్రేజ్ ఉన్న లీడర్. ఇటీవలి వరకు బీజేపీ, కాంగ్రెస్‌లో ఉన్న ఆయన.. ఈ మధ్యే బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన భువనగిరి అసెంబ్లీకి రెండు సార్లు పోటీ చేశారు. 2014లో రెండో స్థానంలో నిలిచారు. 2018లో 13,427 ఓట్లు సంపాదించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీలో కీ రోల్‌లో ఉన్న చింతల వెంకటేశ్వర్‌రెడ్డి భువనగిరి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. నియోజకవర్గంలో మంచి పట్టున్న ఆయన అంతకుముందు పలు కీలక పదవులు చేపట్టారు. భువనగిరి నియోజకవర్గంలో ఎలిమినేటి ఉమామాధవరెడ్డి కుటుంబానిది ప్రత్యేక స్థానం. దివంగత నేత మాధవరెడ్డి, ఉమామాధవరెడ్డి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం వారి కుమారుడు సందీప్‌రెడ్డి జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

**తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్**

ఇక ఆలేరు నియోజకవర్గంలో బీసీల్లో మంచి పేరున్న నేత బూడిద భిక్షమయ్యగౌడ్ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో ఆలేరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 2014, 2018 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేశారు. 2018లో 61,784 ఓట్లు సాధించారు. ఆయనకు ఆత్మకూరు, గుండాలతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మంచి పట్టుంది. ఇటీవల కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కల్లూరి రామచంద్రారెడ్డి 2018కు ముందు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి 11,923 ఓట్లు సాధించారు. బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో ఆయనకు మంచి అనుచర గణం ఉన్నది.

### ఏకాకిగా మారిన కాంగ్రెస్.. నేతల సహాయ నిరాకరణ

బీఆర్ఎస్‌లో హేమాహేమీలు చేరడంతో కాంగ్రెస్ పార్టీ ఏకాకిగా మారింది. ఆ పార్టీలో ఎమ్మెల్యే అభ్యర్థులు మినహా చెప్పుకోదగిన నేతలు లేరు. ఆలేరులో బీర్ల ఐలయ్యకు ఆ పార్టీ నేతలే సహకరించడం లేదు. బోరెడ్డి అయోధ్యరెడ్డి, బండ్రు శోభారాణి, సంజీవరెడ్డి, కుడుదుల నగేశ్ తదితర నేతలు సైలెంట్‌గా ఉన్నారు. భువనగిరిలోనూ ఇదే పరిస్థితి. ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు నచ్చక సెకండ్ కేడర్ కూడా బీఆర్ఎస్‌లో చేరుతున్నది. కుంభం అనిల్‌కుమార్ రెడ్డి సొంత మండలం వలిగొండలో పలువురు బీసీ నేతలు అలకబూనారు. నియోజకర్గంలో పలువురు నేతలు పైకి ప్రచారంలో పాల్గొంటున్నా.. ఇంటర్నల్‌గా సహకరించడం లేదని తెలుస్తున్నది.

### 50వేల మెజార్టీ కోసం బీఆర్ఎస్ పావులు

బీఆర్ఎస్ బలపడటం, కాంగ్రెస్ బలహీనపడటంతో కారు పార్టీ గెలుపు నల్లేరు మీద నడకైంది. గతంలో పోటీ చేసినోళ్లు, ఎమ్మెల్యేలు కూడా బీఆర్ఎస్‌లోనే ఉండి ప్రస్తుతం కారు పార్టీ అభ్యర్థుల కోసం పని చేస్తున్నారు. 2018లో ఆలేరులో పోటీ చేసిన బూడిద భిక్షమయ్య గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి గొంగిడి సునీతామహేందర్ రెడ్డి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వారు పెద్ద ఎత్తున చేరికలు చేస్తున్నారు. భువనగిరిలో జిట్టా బాలకృష్ణారెడ్డి సైతం రంగంలోకి దిగారు. నాటి మిత్రులు, శత్రువులు జత కలవడంతో బీఆర్ఎస్ తిరుగులేని మెజార్టీ సాధిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెండు చోట్లా 50వేలకు పైగా మెజార్టీ వస్తుందని అంచనా వేస్తున్నారు.

---

# నేడు బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లు



## గులాబీ శ్రేణులతో కలిసి నామినేషన్లకు సన్నద్ధం

- సీఎం కేసీఆర్ సభలు ఉన్న చోట సాదాసీదాగా..
- సూర్యాపేటలో దాఖలు చేయనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి
- ఆయా నియోజకవర్గాల్లో నామినేషన్ వేయనున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- బుధవారం కోదాడలో నామినేషన్ వేసిన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్
- రేపు ఆఖరు తేదీ.. మిగతా పార్టీల అభ్యర్థులు సైతం సిద్ధం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఓ వైపు ఎన్నికల ప్రచారం.. మరోవైపు పార్టీలో చేరికలపై దృష్టి సారించిన బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ల దాఖలుపై దృష్టి సారించారు. గురువారం శుభ దినం కావడంతోపాటు అధినేత కేసీఆర్ కూడా నేడు నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అభ్యర్థులంతా తమ నామినేషన్లు వేసేందుకు సిద్ధమయ్యారు. నేడు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో నామినేషన్ వేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని కీలక నేతలంతా నామినేషన్ కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నారు. సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి రానుండడంతో ఎస్వీ డిగ్రీ కళాశాల ఏరియా నుంచి పాదయాత్రగా వెళ్లి నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి మంత్రి ప్రసంగించనున్నారు. తుంగతుర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్ అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్‌కు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి హంగామా లేకుండా పార్టీ ముఖ్య నేతలతోనే నామినేషన్ వేయనున్నారు. హుజూర్‌నగర్ గణపతి ఆలయంలో పూజల అనంతరం భారీ ర్యాలీతో నామినేషన్‌కు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సిద్ధమయ్యారు. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ బుధవారం భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు. దీంతో కోదాడలో బీఆర్ఎస్ శ్రేణుల సందడి నెలకొంది. మిర్యాలగూడలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు నేడు నామినేషన్ వేయనున్నారు. ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లోని అమర వీరుల స్థూపం నుంచి ర్యాలీగా ఆర్వో కార్యాలయం వరకు వెళ్లనున్నారు. నామినేషన్ అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించనున్నారు. దేవరకొండలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఇప్పటికే సాదాసీదాగా రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నేడు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. మునుగోడులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలుకు ఏర్పాట్లు చేసుకున్నారు. స్వచ్ఛందంగా తరలివచ్చే పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి అంగడిపేట నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లి చండూరు తాసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. భువనగిరిలో పైళ్ల శేఖర్‌రెడ్డి కూడా నేడు నామినేషన్ వేయనున్నారు. సాయిబాబా ఆలయంలో పూజల అనంతరం భారీ ర్యాలీతో ఆర్వో కార్యాలయానికి చేరుకుంటారు.

### నేడు, రేపు కోలాహలం

నామినేషన్ల దాఖలుకు ఇవ్వాళ, రేపు మాత్రమే గడువు ఉంది. ఈ రెండ్రోజులు ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో భారీ సందడి నెలకొననుంది. కాంగ్రెస్‌కు సంబంధించి నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండలో నేనావత్ బాలూనాయక్, భువనగిరిలో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాత్రమే ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేశారు. మిగతా వారంతా ఇవ్వాళ, రేపు వేసేందుకు ప్లాన్ చేసుకున్నారు.

### సీఎం సభలున్న చోట సాదాసీదాగా..

నల్లగొండ జిల్లాలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలు ఉన్న నియోజకవర్గాల్లో సాదాసీదాగా నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ముఖ్య నేతలతో కలిసి నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 20న అధినేత కేసీఆర్ బహిరంగ సభ ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం సాదాసీదాగా నామినేషన్ వేయనున్నారు. నకిరేకల్‌లో ఈ నెల 20న కేసీఆర్ మీటింగ్ ఉండడంతో ఇక్కడ కూడా చిరుమర్తి లింగయ్య ఎటువంటి హడావుడి లేకుండా ముఖ్య నేతలతో కలిసి నామినేషన్ వేయాలని నిర్ణయించారు. నాగార్జునసాగర్‌లో ఈ నెల 14న అధినేత కేసీఆర్ బహిరంగ సభ ఉండగా.. నోముల భగత్‌కుమార్ సింపుల్‌గా నామినేషన్ వేయనున్నారు. పార్టీ ముఖ్యులతో కలిసి నిడమనూరు ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆలేరులో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శుక్రవారం అధికారికంగా హంగామా లేకుండా ముఖ్య నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే రెండు సెట్ల నామినేషన్లను సునీత తరపున పార్టీ నేతలు దాఖలు చేశారు.